# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 134 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 10 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన
# బాధాకరం

- ఘటనపై ముగ్గురు నిపుణులతో కమిటీ ఏర్పాటు
- బాధితులను పరామర్శించిన డిప్యూటీ సిఎం పవన్



**విశాఖపట్నం,మన జనప్రగతి జూన్ 09:** విశాఖ ఉక్కు కర్మాగారంలో మెటల్ లిక్విడ్ లాడిల్ పేలి ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం విశాఖకు చేరుకున్న ఆయన, మొదట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మిగతా2లో...

## డిజిలైటేజషన్, ఎఐలదే
# కీలక భూమిక

**విద్యార్థులను సవాళ్లకు సన్నద్ధం చేయాలి**

**టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ సాగాలి**

**విక్రమ సింహపురి స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల నజీర్ పిలుపు**






**నెల్లూరు,మన జనప్రగతి జూన్ 09:** ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం రోజు రోజుకూ పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ విద్యను విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. మంగళవారం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వవిద్యాలయం గత పదిహేడేళ్లుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని మిగతా2లో...

## హెచ్1 బి వీసాపై
# ట్రంప్‌కు షాక్

- లక్ష డాలర్ల ఫీజుపై కోర్టు కొట్టివేత



**వాషింగ్టన్,మన జనప్రగతి జూన్ 09:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు మిగతా2లో...


## దేశ ద్రోహులకు
# స్థానం లేదు

**భారత్ ధర్మసత్రం కాదు**

**లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్**




## స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు
# 25 లక్షల పరిహారం

**గాయపడ్డ వారికి 10 లక్షల చొప్పన సాయం**

**ప్రమాదఘటన జరగ్గానే కేంద్ర మంత్రుల రాక: మంత్రి లోకేశ్ వెల్లడి**



**విశాఖపట్నం,మన జనప్రగతి జూన్ 09:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. గాయపడినవారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌లో నిన్న జరిగిన ఘటన చాలా బాధాకరమని అన్నారు. 4.15 నిమిషాలకు ఈ ప్రమాదం జరిగిందని తెలియగానే కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు ఇక్కడికి వచ్చారని మిగతా2లో...

## అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్
# పర్యాటక రంగం

**ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్‌తో ఎంఓయూ**

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్**



**రాజమహేంద్రవరం,మన జనప్రగతి జూన్ 09:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా విస్తరించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఏపీ టూరిజం శాఖ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ మధ్య చరిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. విశాఖపట్నంలో సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు 41వ ఐఏటీవో వార్షిక సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ వార్షిక సదస్సు సందర్భంగా ఒప్పందం మిగతా2లో...

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని
# నిరూపిస్తావా..?

**నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా..: సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 09:**తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మిగతా2లో...



# లోకేశ్ అంటే భయపడుతోన్న జగన్

**అందుకే టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం**

**శ్రీకాకుళం,మన జనప్రగతి జూన్ 09:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కోకి లోకేశ్ అంటే భయమని, అందుకే ఆయనను టార్గెట్‌గా చేసుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని మిగతా2లో...

# కాంగ్రెస్‌కు ఊహించని షాక్

**- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ**

- అఫిడవిట్‌లో వివరాలు దాచారన్న కారణంతో తిరస్కరణ
- బిజెపి అడుగడుగునా ఓట్ చోరీకి పాల్పడుతోందన్న కాంగ్రెస్
- ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తున్న సింఎం రేవంత్ రెడ్డి



**భోపాల్,మన జనప్రగతి జూన్ 09:** రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి భారీ ఝలక్ తగిలింది. ఆ పార్టీ తరఫున సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను ఈసీ తిరస్కరించింది. ఆమె మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేషన్ వేశారు. మీనాక్షి నటరాజన్‌పై బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఆమె తన ఆస్తుల వివరాల్ని సరిగ్గా వెల్లడించలేదని, అలాగే, తనపై తెలంగాణలో దాఖలైన క్రిమినల్ కేసు వివరాల్ని కూడా నామినేషన్‌లో పేర్కొలేదని బీజేపీ ఫిర్యాదు చేసింది. నామినేషన్ పరిశీలన సందర్భంగా మిగతా2లో...

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
10 - 06 - 2026

# డిజిలైటేజషన్, ఎఐలదే కీలక భూమిక

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో 'ఓ' గ్రేడ్ సాధించడం గర్వకారణమని ప్రశంసించారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రస్తావించారు. డీప్ ఓషన్ మిషన్ కార్యక్రమం కింద మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల గ్రాంట్ లభించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త అవకాశాలను కల్పించిందని వివరించారు. ఈ నిధుల ద్వారా పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ విద్య, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరింత ఊతమిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్–టు – విలేజ్, ల్యాబ్ – టు – ల్యాండ్ వంటి కార్యక్రమాలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రపంచానికి మీ అత్యుత్తమ కృషిని అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. అప్పుడు ప్రపంచం కూడా మీకు అత్యుత్తమ అవకాశాలు, గుర్తింపు, విజయాలను తిరిగి అందిస్తోందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించగలరని చెప్పుకొచ్చారు. విద్యే సమాజ మార్పునకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించే వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సదస్సులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

# స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఈ ఘటనలో 9 మంది చనిపోయారని... 6 మంది గాయపడ్డారని చెప్పారు. తాము పరిహారం ఇవ్వడానికి ఇక్కడకు రాలేదని... శాశ్వతంగా బాధితులకు అండగా ఉంటామని లోకేశ్ భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్మికులకు పూర్తిగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. తమకు ఉన్న చిత్తశుద్ధితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. తమకు వాట్సాప్ గ్రూప్ ఒకటి ఉందని.. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా తాము తక్షణమే అక్కడకు వెళ్తామని.. అందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఉన్నారని ప్రస్తావించారు. ఉక్కు కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు'తో స్టీల్ ఎ÷–లాంట్‌ని సాధించుకున్నామని వ్యాఖ్యానించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని ప్రస్తావించారు. ఈ ఘటనపై కార్మిక సంఘాల నేతలు కావాలని అపోహలు సృష్టించొద్దని అన్నారు. 24 గంటలు గడవక ముందే ఇలా మాట్లాడటం భావ్యం కాదని చెప్పారు. విశాఖ ఉక్కును కాపాడాలని కార్మికులు తమను కోరుతున్నారని అన్నారు. విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయని వివరించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో విశాఖ స్టీల్‌కు సంక్షోభం వస్తే.. ఆనాడు మనం కాపాడుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లోకేశ్ చురకలు అంటించారు. 'ఇంత భారీ ప్రమాదం జరిగితే ఇక్కడకు ప్రతిపక్ష టీమ్ లెవెన్ నుంచి కెప్టెన్ వచ్చారా..?. టీం లెవెన్ కెప్టెన్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు. మాకు 124 స్థానాలు ఇచ్చిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాకు ఉంది. పరదాలు కట్టుకొని వెళ్లే వారికి కాదు' అని లోకేశ్ సెటైర్లు గుప్పించారు.

# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకునుందని టూరిజం శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగానే ఐఏటీవోతో భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. 41వ ఐఏటీవో వార్షిక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం ఏపీకి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. సీఎం ఆదేశాల మేరకు జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖలో జరిగే ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలోని బీచ్‌లు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి సౌందర్య ప్రాంతాలు, వారసత్వ సంపద వంటి పర్యాటక విశేషాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం లభిస్తుందని మంత్రి దుర్గేశ్ చెప్పారు.

ఒప్పందం ద్వారా ఏపీకి విదేశీ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని మంత్రి దుర్గేశ్ వివరించారు. సెప్టెంబర్‌లో జరిగే సదస్సుకు దాదాపు వెయ్యి మంది అంతర్జాతీయ టూరిజం ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక టూర్ ఆపరేటర్లకు ప్రోత్సాహంగా ఐఏటీవో సభ్యత్వ నమోదు ఫీజులో 50 శాతం ప్రత్యేక రాయితీ కల్పించడంతో పాటు రూ.10వేల జాయినింగ్ ఫీజును పూర్తిగా మినహాయించినట్లు దుర్గేశ్ వెల్లడిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పర్యాటక రంగంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగడంతో భారీ ప్రాజెక్టులు ముందుకు వస్తున్నాయని మంత్రి దుర్గేశ్ చెప్పుకొచ్చారు. ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలూ పెరుగుతాయని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు. ఈ సదస్సు జాతీయ ట్రావెల్ ట్రేడ్, పర్యాటక రంగ అగ్రనేతల సమక్షంలో ఏపీలోని వైవిధ్యభరితమైన పర్యాటక అవకాశాలను ప్రదర్శించేందుకు అరుదైన వేదికగా నిలవనుందని మంత్రి దుర్గేశ్ అభిప్రాయపడ్డారు.

# మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు

**మొహర్రం ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష**

**రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 09:** ఈనెల 16న జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్లు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు తాగు నీటి సరఫరా చేయాలని, జి.హెచ్.ఎం.సి అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ–కా–ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం కురేషీ, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మిర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్, మైనారిటీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్(ఊఓచాః) ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు అఇక్ష తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ

**- అండగా ఉంటామని వాసంశెట్టి హామీ**



**విశాఖపట్నం,మన జనప్రగతి జూన్ 09:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనలో గాయపడిన వారిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ పరామర్శించారు. మంగళవారం)ఉదయం షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను మంత్రి పరామర్శించి.. వారి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమైనదన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారిలో ముగ్గురు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించానని.. మెరుగైన వైద్య చికిత్స అందుతోందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు... గాయపడిన వారికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు చెప్పారు. కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని స్పష్టం చేశారు. ప్రమాద ఘటన జరిగినప్పుడు కార్మికులు అవసరమైన సంఖ్యలోనే ఉన్నారని వెల్లడించారు. స్టీల్ ఎలాంట్‌లో క్రమం తప్పకుండా తనిఖీలు జరిగాయన్నారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ పేర్కొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

పరామర్శించారు. అనంతరం స్టీల్ ఎలాంట్ పరిధిలోని ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, యాజమాన్యంతో మాట్లాడారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, త్వరలోనే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న క్షతగాత్రుల వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పవన్ కల్యాణ్ కీలక ప్యాకేజీని ప్రకటించారు. ప్రమాదంలో మరణించిన రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ. 45.75 లక్షల పరిహారంతో పాటు, మృతుల కుటుంబాలకు అదనంగా రూ. 25 లక్షల సహాయం అందజేస్తామన్నారు. అంతేకాకుండా, స్టీల్ ఎలాంట్ ఉద్యోగులు, కార్మికులు ఎవరూ నివాసాల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి కార్మికుడు తమ రిటైర్మెంట్ వరకు స్టీల్ ఎలాంట్ క్వార్టర్స్ లోనే కొనసాగేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# హెచ్1 బి వీసాపై ట్రంప్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

# దేశ ద్రోహులకు స్థానం లేదు

**లక్నో,మన జనప్రగతి జూన్ 09:** దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లఖ్‌నవూలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు. 'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృత మవుతుందని అన్నారు. ౹÷శంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రామాయణ కాలంలో కూడా ఖాళీగా ఉన్న భూములను మారీచుడు, ఖరదూషణాది రాక్షసులు దురాక్రమణ చేసేవారని, ల్యాండ్ జిహాద్‌కు పాల్పడేవారని అన్నారు. ప్రతి యుగంలోనే దుష్టశక్తులు ఉంటాయని, అయితే సత్యం, మతం పరిరక్షణకు శ్రీరాముడు ఏవిధంగా పాటుపడ్డారో అందరూ తెలుసుకుని కర్తవ్యబద్ధులుకావాలని, అంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

# ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా..?

(మొదటి పేజీ తరువాయి)

బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.ద

# లోకేశ్ అంటే భయపడుతోన్న జగన్

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లాల్లో రామ్మోహన్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎస్సీ విషయంలో వైసీపీ విషప్రచారాన్ని తమ ప్రభుత్వం తిప్పి కొట్టిందని రామ్మోహన్ తెలిపారు. వైసీపీ తాను తీసిన గోతిలో తానే పడిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పెద్దఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఏపీ అభివృద్ధిలో ముందుకు సాగుతోందని ఉద్ఘాటించారు. విశాఖ స్టీల్ ఎలాంట్ ప్రమాద ఘటన దురదృష్టకరమని చెప్పారు. బాధిత కుటుంబాలకు స్టీల్ ఎలాంట్ యాజమాన్యం ఆదుకుంటుందని రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు.

# కాంగ్రెస్‌కు ఊహించని షాక్

(మొదటి పేజీ తరువాయి)

మీనాక్షి నామినేషన్ తిరస్కరిస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. మీనాక్షి నామినేషన్ కోల్పోవడంతో ఈ రాజ్యసభ సీటు బీజేపీ వశం కానుంది. ఆ పార్టీ తరఫున నామినేషన్ వేసిన మహేశ్ కేవత్ రాజ్యసభకు ఎన్నిక కానున్నారు. దీంతో బీజేపీకి విజయం దక్కితే, కాంగ్రెస్ ఒక సీటు కోల్పోనుంది. తన నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై మీనాక్షి స్పందించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థల మీద బీజేపీ దాడిచేస్తోందన్నారు. సరైన బలం లేని చోట బీజేపీ అభ్యర్థిని నిలపడంలోనే ఆ పార్టీ వైఖరి, విధానం అర్థమవుతోందని ఆమె విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఇతర ఎన్నికల్లాగే, రాజ్యసభ ఎన్నికల్ని కూడా బీజేపీ ప్రభావితం చేస్తోందన్నారు. ఇది ఒక రాజ్యసభ సీటుకు సంబంధించిన అంశం కాదని, భారత ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశమని ఆమె వ్యాఖ్యానించారు.మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ సీఎం రేవంత్ స్పందించారు. ఇది కేంద్రం కుట్ర అని అభివర్ణించారు. మొన్న ఓటు చోరీ, ఇప్పుడు సీటు చోరీ అంటూ రేవంత్ అన్నారు. తెలంగాణలో మీనాక్షిపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని ఆయన తెలిపారు. ఈసీ నిర్ణయంపై చట్టపరంగా పోరాడుతామని, కోర్టులో కేసు వేస్తామన్నారు.

## ఎన్.హెచ్ 340సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 09:-**ఎన్.హెచ్ 340 సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్హెచ్ 340 సి లో భాగంగా నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న పనుల పురోగతి పై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న మొత్తం 9 కిలోమీటర్ల రహదారి విస్తరణ ప్రాజెక్టులో ఇప్పటివరకు సుమారు 7.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్లలో జరుగుతున్న పనులలో పురోగతి తీసుకొని రావాలన్నారు. మిగిలిన 1.5 కిలోమీటర్ల భాగంలో సుమారు కిలోమీటర్ మేర పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. మిగిలిన 500 మీటర్ల విభాగంలో కూడా కేవలం 300 మీటర్ల మేర మాత్రమే సమస్యాత్మక ప్రాంతం ఉందని, ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతం వద్ద ఆలయం కారణంగా పనులలో కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు అందుబాటులోకి రానున్నాయన్నారు.సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, నేషనల్ హైవే, కర్నూలు ఈఈ విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరల పెంపును వెంటనే తగ్గించాలి

**- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య**






**పత్తికొండ మన జనప్రగతి జూన్ 09:-**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర వస్తువులతో పాటు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వీటిని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో వినూత్న రాస్తారోకో నిర్వహించారు. మహిళలు రోడ్డుపై వంట చేస్తూ నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆనంద్‌బాబు పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో ఇంధన ధరలు తగ్గకపోవడం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతోందని విమర్శించారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చి ధరలను అదుపు చేయాలని, లేకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి యు. కారమంచి, సీపీఎం నాయకుడు దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

## రెండేళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు మోసమే మిగిలింది: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ





**పత్తికొండ మన జనప్రగతి జూన్ 09:**రాష్ట్రంలో గత రెండేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ విమర్శించారు. సోమవారం మద్దికెర పట్టణంలోని డీపీఏపీ కళ్యాణ మండపంలో పత్తికొండ నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వ రెండేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలు, వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రతిబింబించే ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.రాష్ట్రంలో అభివృద్ధి పనులు కనిపించడం లేదని, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాల వల్ల నిరాశకు గురయ్యారని అన్నారు. టీడీపీ నాయకులు ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా స్వప్రయోజనాలకే పరిమితమయ్యారని విమర్శించారు.అమరావతి రాజధాని నిర్మాణం పేరుతో అవినీతి జరుగుతోందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసి భారీ అప్పుల భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.ఈ నెల 12న నిర్వహించనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎస్టీ సెల్, ఎస్సీ సెల్ ప్రతినిధులు, మండల కన్వీనర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఠా కక్షలు మానండి ఆత్మీయంగా జీవిద్దాం

**● బిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం**



**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 09:-** కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గారైన షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి ముద్దనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామంలో వర్గకక్షలు, సైబర్ నేరాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కళా-జాగృతి బృందం ఇన్‌ఛార్జ్ జి. నరసారామ్ ఆధ్వర్యంలో “మేలుకొలుపు” నాటిక, పాటల ప్రదర్శన నిర్వహించి గ్రామస్తులకు చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వర్గకక్షలను విడనాడి పరస్పర సహకారంతో, ఆత్మీయతతో జీవించాలని, తద్వారా మన పిల్లల భవిష్యత్తును బంగారుమయం చేయాలని పిలుపునిచ్చారు.ముద్దనూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. నాగేష్ బాబు మాట్లాడుతూ, ప్రజలు వర్గకక్షలకు దూరంగా ఉంటూ తమ పిల్లలకు మంచి విద్యను అందించాలని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించి మెరుగైన దిగుబడులు సాధించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్గకక్షల వల్ల నష్టపోయిన కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టం, పిల్లల భద్రత, బాల్య వివాహాల నివారణ, ఈవ్ టీజింగ్, డయల్-112 సేవలు, రహదారి భద్రత, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు మరియు సైబర్ నేరాల నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.పోలీస్ కళా-జాగృతి బృందం ప్రదర్శించిన “మేలుకొలుపు” నాటకం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెంపుపై వేంపల్లిలో సీపీఐ రాస్తారోకో..

**గ్యాస్ బండ మోస్తూ.. ఆటోను ఈడ్చుతూ వినూత్న నిరసన**

**కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీ నేతల డిమాండ్**



**వేంపల్లి మన జనప్రగతి జూన్ 09:-**కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం వేంపల్లి అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.నిరసనలో భాగంగా కార్యకర్తలు ఆటోను తాళ్లతో కట్టి ఈడ్చుతూ, గ్యాస్ సిలిండర్‌ను భుజాన మోస్తూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలపై భారాలు మోపడమేనని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇంధన ధరల పెంపు సామాన్యుల జీవన వ్యయాన్ని మరింత పెంచిందన్నారు.దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పటికీ ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు అధికమై, అన్ని రకాల వస్తువుల ధరలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. దీంతో మధ్యతరగతి, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎరువుల ధరలు పెరగడం, కొరత పరిస్థితులు నెలకొనడం రైతులకు మరింత భారంగా మారిందన్నారు. సాగు వ్యయాన్ని తగ్గించేలా రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి, ధరలను నియంత్రించాలని కోరారు.

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని, రైతులు మరియు సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాలను తగ్గించే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శులు బ్రహ్మం, అంజన్నప్ప, వేముల మండల కార్యదర్శి చాంద్ భాష, ఏఐటీయూసీ ఏరియా కోశాధికారి బత్తల మల్లేష్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్, నాయకులు ఎస్ఎండీ గౌస్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

## రెండు సంవత్సరాల సుపరిపాలన ప్రజలతో మమేకం

**జూన్ 12న తిరుపతిలో ఎన్‌డిఏ కూటమి విజయోత్సవాల సభ నిర్వహణ**

**బహిరంగ సభకు హాజరయ్యే వారికి తగిన విధంగా ఏర్పాట్లు**

**జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**



**తిరుపతి మన జనప్రగతి జూన్ 09:-** కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 12న తిరుపతి నందు బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజలతో మమేకమై గత 24 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సుపరిపాలన, చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని ఎన్డిఏ ప్రభుత్వం యోచన చేయడం జరిగిందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తిరుపతిలో దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు జూన్ 12 న విచ్చేస్తున్న నేపథ్యంలో మంగళవారం సభా ప్రాంగణం వద్ద ముందస్తు ఏర్పాట్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలిసి క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసి ఆర్.గోవిందరావు, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, చంద్రగిరి,సూళ్లూరుపేట, గూడూరు ఎంఎల్ఏ లు పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, పాశం సునీల్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్స్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఎన్డిఏ కూటమి ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్డిఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కార్యక్రమాలను వివరించేందుకు తిరుపతి, అమరావతి, విశాఖపట్నం ప్రాంతాల్లో విడివిడిగా సమావేశాలు నిర్వహించాలని గతంలో నిశ్చయించుకోవడం జరిగిందని తెలిపారు. అయితే, దురదృష్టవశాత్తు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కారణంగా బాధితులకు అండగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించడంతో రాష్ట్ర మానవ వనరులు, ఐటి శాఖ మంత్రితో పాటు పలువురు మంత్రులు బాధితులను పరామర్శించడం జరిగిందన్నారు. దుర్ఘటన పై స్పందించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలకు రూ.10 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించారన్నారు. కేంద్రం నుంచి కూడా సహాయం అందించడం జరుగుతుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు బాధిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా కేబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన జూన్ 12 తేదీన మూడు ప్రాంతాలలో కాకుండా రాష్ట్ర స్థాయిలో తిరుపతి పట్టణంలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిశ్చయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధ్వంసం నుండి వికాసం వైపు ప్రయాణిస్తోందన్నారు. ఎన్డిఏ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తీరును వివరించడం కోసమే బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ హామీ నెరవేర్చడంతో పాటు ఈ 24 నెలలను సూపర్ 24 చేశామన్నారు. ప్రజల పై గౌరవం ఉన్న ముఖ్యమంత్రి నెలకు కనీసం 10 సార్లు ప్రజలతో మమేకమై క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించే దిశగా పరిపాలన సాగిందన్నారు. మన దేశానికి వచ్చే పెట్టుబడులలో 25 శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని, దీనితో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్లు పెట్టుబడులు రావడం జరిగిందన్నారు. ఉద్యోగ కల్పనలో భాగంగా ఎప్పుడూ వినని విధంగా డిఎస్సి నిర్వహించామని, రైతులకు పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ, తల్లులకు తల్లికి వందనం కింద నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కరించడంతో పాటు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయడం జరిగిందన్నారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం అమలు చేస్తున్నామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, రీసర్వే పక్కాగా నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో భరోసా కల్పించే విధంగా ఎన్ డి ఏ ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నారని, విద్యాశాఖ మంత్రి లోకేష్ విదేశీ పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్రానికి తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా ఎన్డిఏ కూటమి ఎంఎల్ఏ లు, ఎం ఎల్ సి లు, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు 50 వేల మంది ప్రజలు పాల్గొననున్నారని, అందుకు తగిన విధంగా ప్రాంగణాన్ని సిద్ధం చేయడం తో పాటు, అవసరమైన సదుపాయాలను కల్పించడం జరుగుతున్నదన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
10 - 06 - 2026

## రేణిగుంట విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



**తిరుపతి, మన జనప్రగతి జూన్ 09 :-** తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటన లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు, ఎయిర్పోర్ట్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి స్వాగతం పలికన వారిలో వున్నారు

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మదనపల్లి తహసీల్దార్ టి. మాధవి



**మదనపల్లి, మన జనప్రగతి జూన్ 09:-** మదనపల్లి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. మాధవి మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.తహసీల్దార్ టి. మాధవి జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మదనపల్లి మండల పరిధిలోని రెవెన్యూ శాఖ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు,జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## నిస్సహాయ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించిన కలెక్టర్



**తిరుపతి, మన జనప్రగతి జూన్ 09:-** కర్ణాటక రాష్ట్రానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు శారదమ్మ దిక్కుతోచని స్థితిలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను కలిసి ఆశ్రయం కల్పించాలని కోరగా, ఆయన మానవతా దృక్పథంతో స్పందించి వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. భర్త మరణంతో జీవనాధారం కోల్పోయిన శారదమ్మ తిరుపతికి చేరుకుని పలు వృద్ధాశ్రమాలను ఆశ్రయించినప్పటికీ అవకాశం లభించలేదు. దీంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి తన పరిస్థితిని వివరించింది.వృద్ధురాలి పరిస్థితికి చలించిన కలెక్టర్, బీటీఆర్ కాలనీలోని రాష్ట్రీయ సేవా సమితి వృద్ధాశ్రమంలో ఆమెను చేర్పించి ఆశ్రయం, వైద్యం, అవసరమైన సంరక్షణ అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌కు శారదమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

## అంతర పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 09:-**రైతులు అంతర పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించి లాభసాటిగా వ్యవసాయం చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మంగళవారం మండలంలోని ఖాజిపల్లె గ్రామంలో రైతు రెడ్డయ్య పొలంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ వై. సింగరయ్య మాట్లాడుతూ వేరుశనగ, అలసంద, పెసర, కంది వంటి అంతర పంటలను సాగు చేయడం రైతులకు ప్రయోజనకరమని వివరించారు. అంతర పంటలకు వారానికి రెండు రోజుల పాటు నీరు అందిస్తే సరిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాగ్యమ్మ, సుమలత, చంద్రకళతో పాటు రైతు రెడ్డయ్య పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 'జనబాట' కార్యక్రమం



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 09:-** సిద్ధవటం గ్రామపంచాయతీ పరిధిలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో "కరెంటోళ్ల జనబాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ జయచంద్ర మాట్లాడుతూ, ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఐఏఎస్ ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారుల సమస్యలను వారి ఇంటి వద్దకే వెళ్లి తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఉన్న వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ పి. సుబ్బయ్య, జూనియర్ ఇంజనీర్ ఎస్. పెంచలయ్య, లైన్‌మన్ సుబ్బారెడ్డి తదితర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం..28 మంది విద్యార్థులకు ఘన సన్మానం

### - పీలేరు కురుబ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార మహోత్సవం






**పీలేరు మన జనప్రగతి జూన్ 09:-** విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే సమాజాభివృద్ధికి పునాది అని చాటిచెప్పేలా పీలేరు మండల కురుబ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యార్థుల ప్రతిభా పురస్కార మహోత్సవం2026' ఘనంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, సంఘ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 20 మంది, ఇంటర్మీడియట్‌లో 900కు పైగా మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి 'ప్రతిభా పురస్కారాల'తో ఘనంగా సత్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కోట లీలారాణి (ఐఎంఎల్ పూతలపట్టు డిపో ఉన్నత అధికారి), డాక్టర్ రోజారాణి (జూనియర్ లెక్చరర్) మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదువే జీవితాన్ని మార్చే శక్తి అని, పదో తరగతి, ఇంటర్మీడియట్ దశలు విద్యార్థి భవిష్యత్తును నిర్దేశించే కీలక ఘట్టాలని పేర్కొన్నారు.కురుబ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాంతారావు, రఘు, జనార్దన్ గౌడ్, శివ, వసంత రాజా, హితేష్ తదితరులు పాల్గొన్నారు. సమాజంలో వెనుకబడిన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు

## పెట్రో, గ్యాస్ ధరల పెంపుపై వామపక్షాల రాస్తారోకో

### - కెజి బేసిన్ గ్యాస్‌లో రాష్ట్రానికి 50 శాతం వాటా కేటాయించాలని డిమాండ్




**కాకినాడ మన జనప్రగతి జూన్ 09:-**కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు మంగళవారం కాకినాడలో అంబేద్కర్ విగ్రహం ఎదుట రాస్తారోకో నిర్వహించాయి.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె. వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సిహెచ్. నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరుసగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. కమర్షియల్ గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాని ప్రభావం సామాన్య ప్రజలపై కూడా పడుతోందన్నారు.అంతర్జాతీయ పరిస్థితులను సాకుగా చూపుతూ ధరల పెంపును సమర్థించడం సరైనది కాదని, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఏర్పడుతున్న కొరత కూడా ప్రైవేట్ ఆయిల్ కంపెనీల లాభాల కోసమేనని ఆరోపించారు. కెజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, సహజవాయువును ఇతర రాష్ట్రాలు, దేశాలకు తరలిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం 12వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఉత్పత్తి జరిగే రాష్ట్రానికి 50 శాతం వాటా ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, కెజీ బేసిన్ గ్యాస్ ఉత్పత్తిలో రాష్ట్రానికి సగం వాటా కేటాయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రాస్తారోకోకు లక్ష్మీ గణపతి టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యదర్శి సరగడ చంద్రశేఖర్‌తో పాటు సభ్యులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంధనం ధరల పెరుగుదలకు నిరసనగా రాస్తారోకో



**చిట్వేలి మన జనప్రగతి జూన్ 09:-** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్,గ్యాస్ ధరలు పెంపును ఉపసంహరించుకోవాలని,వామపక్షాలు రాష్ట్ర కమిటీలు పిలుపుమేరకు మంగళవారం చిట్వేలి లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద, సిపిఎం, సిపిఐ,ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ కేవలం మే నెలలో 11 రోజుల్లో ప్రధాని మోడీ కార్పొరేట్ల లాభాలు కోసం, నాలుగు సార్లు ధరల పెంచారన్నారు. ఇలా ప్రతి సారీ పెంచుకుంటూ దాదాపు 30రూపాయల వరకు పెంచాలని ఆలోచిస్తున్నారు అన్నారు.ఈ కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండవన్నారు.బిజెపి రాకమందు 35 ,45 ఉన్న పెట్రోల్, డీజిల్ 110 రూపాయల వరకు పెరిగిందన్నారు.వంట గ్యాస్ ధరలు, 300 రూపాయలు పైగా పెంచారన్నారు. కమర్షియల్ గ్యాస్ వెయ్యి రూపాయలు దాకా పెంచారన్నారు. ప్రధాని మోడీ విధానాల వల్ల ఇంధనం చార్జీలు పెరిగాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం 20 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 35 రూపాయలు, టాక్స్ వేసి ప్రజల నుండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ టాక్స్‌లు ఉపసంహరించుకోవాలని,పెంచిన ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పందికాళ్ళ మణి, సిపిఐ నాయకులు తిప్పన ప్రసాద్, ఆటో కార్మికులు వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

## అధికారుల వేధింపుల వల్లే వీఆర్వో హుస్సేన్ మృతి



**కాకినాడ మన జనప్రగతి జూన్ 09:-**కర్నూలు జిల్లా వెంకాయపల్లి విఆర్ఓ మహ్మద్ హుస్సేన్ మరణానికి కారణమైన అధికారులపై తక్షణమే చట్ట పరమైన చర్యలు తీసుకుని ఆ కుటుంబాన్ని న్యాయం చేయాలని కాకినాడ జిల్లాలోని వివిధ మండలాలు చెందిన వీఆర్వోలు నిరసన వ్యక్తం చేశారు. అంతే కాకుండా అధికారుల వేధింపులు వల్ల మృతి చెందిన హుస్సేన్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట విఆర్ఓల జేఏసీ నిరసన చేశారు. ఈ సందర్భంగా వీఆర్వో సంఘం జాయింట్ సెక్రటరీ అనిశెట్టి రామకృష్ణ, నాయకులు మల్లేష్, కిషోర్ ఆధ్వర్యంలో విఆర్వోలు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విఆర్ఓ హుస్సేన్ అనారోగ్యం గురైనానని తనకు సెలవు కావాలని అడిగినా అవేమి పట్టించుకోకుండా అధికారులు కావాలని వేదించారన్నారు. సమయపాలన లేక అనేక కారణాలతో వీఆర్వోలు మరణించినట్లు చెప్పారు. ఈనెల 11వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం నిరసన చేస్తామని వారు చెప్పారు.

## అన్నీ తామై అంత్యక్రియలు – మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 09:-** స్థానిక ప్రొద్దుటూరు అమృతనగర్ లో గంటశాల రామలక్షుమ్మ అనే వృద్ధురాలు మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో స్థానికులు ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఈరోజు హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబాహన్, సతీష్,కిరణ్ కుమార్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్దులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా కోరుచున్నామని తెలియజేశారు.82972 53484,9182244150.

## "చిన్నారుల అభివృద్ధికి నవచేతన"




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 09:-**చిన్నారుల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని వైద్యాధికారులు డాక్టర్ భరత్ నారాయణ, డాక్టర్ మధు కుమార్ పేర్కొన్నారు. నవచేతన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో వారు మాట్లాడారు. గర్భధారణ నుంచి శిశువు తొలి వెయ్యి రోజుల కాలం ఎదుగుదలకు అత్యంత ముఖ్యమైన దశ అని, ఈ సమయంలో సరైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. సున్నా నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధిని నిరంతరం పరిశీలించడం అవసరమని సూచించారు. ప్రారంభ బాల్యాభివృద్ధి పరిశీలన ద్వారా పిల్లల్లో ఉన్న అభివృద్ధి లోపాలు, ఆరోగ్య సమస్యలు, ఇతర రుగ్మతలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఈ వివరాలను నమోదు చేసి, అవసరమైన పిల్లలను జిల్లా ప్రారంభ జోక్య కేంద్రానికి పంపించడం ద్వారా సకాలంలో చికిత్స, ప్రత్యేక సేవలు అందించవచ్చని వివరించారు. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో పిల్లల ఆరోగ్య పరిస్థితులను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అమలు చేసి చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు పి. శాంతమ్మ, లక్ష్మమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పొందిన అవగాహనను తమ కేంద్రాల పరిధిలో వినియోగించి చిన్నారుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం



# చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు: వైఎస్సార్సీపీ నేతల విమర్శలు



**కడప మన జనప్రగతి జూన్ 09:-**కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్సీపీ నాయకులు విమర్శించారు. కడపలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ముఖ్య నాయకులు, రైతులు, మేధావులు, యువకులు, విద్యావంతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీఈసీ సభ్యుడు కే. సురేష్‌బాబు, మాజీ మేయర్ పాక సురేష్, ఎస్ఈసీ సభ్యుడు డాక్టర్ సోహెల్ అహ్మద్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఉమర్, అబ్జర్వర్లు గురుమోహన్, గుంటి నాగేంద్ర, దాసరి శివ, పులి వెంకటసుబ్బమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రెండేళ్లలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రైతులకు అండగా ఉంటామని చెప్పి అప్పుల ఊబిలోకి నెట్టారని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను నిరాశపరిచారని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక భరోసా, పేదలకు సంక్షేమ పథకాలు, నిరుద్యోగ భృతి, సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కడప నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. ప్రస్తుతం కనిపిస్తున్న ప్రధాన అభివృద్ధి పనులన్నీ వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైనవేనని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని నాయకులు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అలాగే రానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పార్టీ పట్ల విధేయత, బాధ్యతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. అనంతరం సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి: వామపక్షాల డిమాండ్




**దేవనకొండ మన జనప్రగతి జూన్ 09:-**కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ దేవనకొండ మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. మద్దిలేటి శెట్టి, సీపీఎం జిల్లా నాయకుడు బి. వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం. నరసరావు మాట్లాడుతూ పెరిగిన ఇంధన, గ్యాస్ ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల వల్ల రవాణా చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం మరింత కష్టతరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను గుర్తించి పెంచిన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి సామాన్యులకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, యూసుఫ్ బాషా, బజారే తిమ్మప్ప, హరిచంద్ర, జహంగీర్, నరసింహుడు, నాగేష్, రఘు, ఎర్రిస్వామి, రామాంజి, మహాదేవ్, వీరాంజనేయులు, పెద్దరంగన్న, దొడ్డప్ప, మహేంద్ర, నాగేంద్ర, అనిల్ కుమార్, రవీంద్ర, రంగస్వామి, రంగన్న, శేఖర్, రంగడు, బలరాముడు, లాలు సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# 15 ఏళ్లుగా బాలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు

## కమల్ బాషా అభిమానానికి బాలకృష్ణ ప్రశంసలు

## హైదరాబాద్‌లో మర్యాదపూర్వక భేటీ..శాలువాతో ఘన సన్మానం



**తాడపత్రి మన జనప్రగతి జూన్ 09:-**హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ కు తాడపత్రి నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ టౌన్ అధ్యక్షుడు కమల్ బాషా ముందస్తు 66వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బాలకృష్ణ స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి,శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమల్ బాషా మాట్లాడుతూ...గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏడాది బాలకృష్ణను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానని చెప్పారు. బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని తాడపత్రిలో అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమల్ బాషా సేవా కార్యక్రమాలను అభినందించిన బాలకృష్ణ, సమాజ సేవలో మరింత చురుకుగా పాల్గొనాలని సూచించారు. భవిష్యత్తులో ఆయనకు తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది తనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం గర్వకారణమని,అభిమానుల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని బాలకృష్ణ అన్నారు.

# మున్సిపల్ పెట్రోల్ బంకు అవినీతిపై బీజేపీ డిమాండ్

## ● అవినీతి ఆరోపణలపై పారదర్శక విచారణ చేయాలి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 09:-**ప్రొద్దుటూరు మున్సిపల్ పెట్రోల్ బంకులో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి వ్యవహారంపై అధికారులు "విచారణ జరుగుతోంది" అంటూ కాలయాపన చేయడం సమంజసం కాదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర, పారదర్శక మరియు నిష్పాక్షిక విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన బాధ్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ధనానికి జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి, బాధ్యుల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని కోరారు. విచారణ పేరుతో ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులు వెంటనే నివేదికను ప్రజల ముందుంచి వాస్తవాలను వెల్లడించాలని అన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారెవరైనా వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విచారణను జాప్యం చేస్తే, న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రజా ధనానికి సంబంధించిన అంశాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, తప్పు చేసిన వారిని కాపాడే ప్రయత్నాలు జరిగితే ప్రజలు సహించరని ఆయన పేర్కొన్నారు.

# స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా అవసరం: డీఎంహెచ్ఓ డాక్టర్ కే.నాగరాజు




**కడప మన జనప్రగతి జూన్ 09:-**జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా ఉంచి, నిబంధనల అమలును కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.నాగరాజు అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా పి.సి.పి.ఎన్.డి.టి. నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం, మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను తరచూ తనిఖీ చేయడంతో పాటు, నిర్వహిస్తున్న స్కానింగ్‌ల వివరాలను ఆన్‌లైన్‌లో సకాలంలో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రోగ్రామ్ అధికారులు, కమిటీ సభ్యులకు సూచించారు. ప్రతి స్కాన్ సెంటర్ పి.సి.పి.ఎన్.డి.టి. చట్టానికి లోబడి కార్యకలాపాలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కొత్తగా ఐదు స్కానింగ్ కేంద్రాలకు, 16 కేంద్రాల లైసెన్స్ పునరుద్ధరణకు, 11 కేంద్రాల మార్పులకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ఎన్‌జీవో ప్రతినిధులు, సీడీపీఓలు, డెమో సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలను చేర్పించండి: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సునీత




**వేంపల్లె మన జనప్రగతి జూన్ 09:-**అంగన్వాడి కేంద్రాల్లో మూడేళ్ల వయసు కలిగిన పిల్లలను చేర్పించి వారి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు కృషిచేయాలని వేంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సునీత పేర్కొన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీ నుంచి చేపట్టిన అంగన్వాడీ పిలుస్తోంది.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక గండి రోడ్డు లోని శ్రీరామ్ నగర్ అంగన్వాడీ కేంద్ర పరిధిలో సిడిపిఓ సునీత నేతృత్వంలో ఐసిడిఎస్ సిబ్బంది పిల్లలు తల్లులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలను తప్పని సరిగా అంగన్వాడి కేంద్రాలలో నమోదు చేయాలన్నారు. వీరికి అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆట పాట లతో కూడిన విద్యను అందించడం జరుగుతున్నదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాక పిల్లల మెదడు అభివృద్ధి మొదటి ఆరు సంవత్సరాల్లోనే 90శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. అందువల్ల పిల్లలకు ప్రేరణాత్మకమైన ఆరంభ అభ్యసనను ప్రారంభించాలని దీనివల్ల మెదడులోని న్యూరాన్ల కనెక్టివిటీ పెరిగి పిల్లల మేధాభి వృద్ధికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు చేయించే ఆట, పాట, మాట కార్యక్రమాల వల్ల పిల్లల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా కాన్వెంట్ల పట్ల ఇష్టం పెంచుకోవద్దని తమ పిల్లల్ని ఖచ్చితంగా అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని సిడిపిఓ కోరారు. కార్యక్రమంలో వేంపల్లి సెక్టార్ సూపర్వైజర్ స్వర్ణలత,పద్మ,అంగన్వాడీ కార్యకర్తలు,అంగన్వాడీ సహాయకురాలు,తల్లులు పాల్గొన్నారు.


# ప్రజలకు పారదర్శకంగా సేవలందించండి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 09:-** ప్రజలతో నిత్యం సంబంధాలు ఉండే రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న మీరు ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా సేవలందించాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్, తెదేపా నేత దిల్మాంగే చంద్రశేఖర్ రెడ్డి తహసీల్దార్ జల్లా శివ శంకర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు తెదేపా నేతలు మంగళవారం తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ ను కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు మూలి గంగాధర్ రెడ్డి, తెదేపా నేతలు మహమ్మద్ అలీ ( సెట్ ) ఇమ్రాన్, మంజు,నరసింహ, ఖాసీం వల్లి,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాధవరం-1లో వీధిలైట్ల సమస్యకు పరిష్కారం ఎప్పుడో..?

## - అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 09:-**మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో వీధిలైట్లు నెలలుగా వెలగకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు వినతులు అందజేసినా, స్థానిక పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ గ్రామంలోని ప్రాథమిక సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. రాత్రి వేళల్లో చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ, వెంటనే వీధిలైట్లను మరమ్మతు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ..



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 09:-** వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు కలిగి ఉండి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల ఎస్ఐ సుస్మిత అన్నారు. మంగళవారం మండలంలోని స్థానిక సాయిబాబా ఆలయం వద్ద తన సిబ్బంది తో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆమె హెల్మెట్ లేని ద్విచక్ర వాహన ఫైన్లు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని ముఖ్యంగా మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వరాదని అట్లు ఇచ్చిన వారి తల్లిదండ్రుల పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

# మన గ్రోమోర్ సెంటర్‌ను ఆకస్మికంగా వ్యవసాయ అధికారులు తనిఖీ



**సిరివెళ్ల మన జనప్రగతి జూన్ 09:-** మండల కేంద్రమైన సిరివెళ్ల 40వ కర్నూల్ చిత్తూరు జాతీయా రహదారిపై సిరివెళ్ల మెట్ట వద్ద సమీపంలో ఉన్న మన గ్రోమోర్ సెంటర్ ను ఆకస్మికంగా వ్యవసాయ అధికారులు తనకి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో డిఎ ఓ వెంకటేశ్వర్లు, డిడిఎ గంగాధర్ మరియు ఏడిఏ విజయ్ శేఖర్, మన గ్రోమోర్ సెంటర్ ను అకస్మిక తనిఖీ చేశారు. అందులో ముఖ్యంగా ఎపి ఎఐయమ్ య స్ 2.0 త లో యూరియా, డిఏపి అమ్మ కాలు మరియు ఐ యప్ యమ్ యస్ యూరియా, డిఏపి అమ్మకాలు సమానంగా ఉండాలని సూచించారు అలాగే కాంప్లెక్స్ ఎరువులని ఎమ్మార్పీ ధర ఎంత ఉంటే ఆ రేట్ కు అమ్మాలని సూచించారు. అలాగే రైతులందరూ వేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ రైతు సేవ కేంద్రంలో చేయించు కోవాలని తెలియ జేశారు. మన గ్రోమోర్ సెంటర్ మేనేజర్ మహేశ్వరరెడ్డి ఉన్నరు.

# పదవ తరగతిలో ఉత్తీర్ణులైన వారి ఫోటోలతో ఫ్లెక్సీల ఆవిష్కరణ

### - బడి పిలుస్తోంది కార్యక్రమం



**గాలివీడు మన జనప్రగతి జూన్ 09:-** బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ హై స్కూల్ నూలివీడు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ వేల్పుల జనార్ధన్ ఉపాధ్యాయులు మనోహర్ నాగరాజు, రమేష్ నాయక్ ఆదినారాయణ,వెంకటరమణ హరీష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల యొక్క మార్కుల వివరములను పాంప్లెట్ రూపంలో రూపొందించి మరియు ఫ్లెక్సీలను ఆవిష్కరించారు.


# హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు.. హాస్టళ్లలో దోమల నివారణ స్ప్రేయింగ్





**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 09:-** స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.శ్రీలక్ష్మి చల్లా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పి ఎంఎస్ఎంఎ) కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో కురువల్లి,బొమ్మనహాల్,నేమకల్ గ్రామాలకు చెందిన హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు,గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ముఖ్యంగా శెనగలు,బెల్లం, గోంగూర,మునగాకు,చిక్కుడు వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఇంకా రెండు రోజులలో ప్రారంభంకానున్న విద్యాసంస్థలు భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ,బీసీ హాస్టళ్లలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్,మలేరియా కార్యకర్త భీమా ఆధ్వర్యంలో దోమలు,కీటకాల నివారణ కోసం అల్ట్రా స్ట్రెప్టో మైట్రిన్ 5 శాతం మందును స్ప్రే చేశారు.ఈ కార్యక్రమంలో సీహెచ్ఓఎన్, ఈశ్వరయ్య,ఆరోగ్య కార్యకర్తలు నాగేంద్ర,గోవర్ధన్,వార్డెన్ లక్ష్మి, ఏఎన్ఎం భాగ్యశ్రీ,ఆశా కార్యకర్తలు మధులత,శివమ్మ, పాల్గొన్నారు.

# పార్నపల్లి ముని మౌనికకు ఫిజిక్స్‌లో వైవియూ డాక్టరేట్



**కడప మన జనప్రగతి జూన్ 09:-**యోగి వేమన విశ్వవిద్యాలయము ఫిజిక్స్ పరిశోధక విద్యార్థిని పార్నపల్లి ముని మౌనికకు వై.వి.యూ డాక్టరేట్ ని ప్రదానం చేసింది. డాక్టర్ ఎ.రాఘవేందర్ పర్య వేక్షణలో " నెక్స్ట్ జనరేషన్ బై ఫేషియల్ టాండం సోలార్ సెల్స్ ఫ్యాబ్రికేషన్ అండ్ పెర్ఫార్మెన్స్ ఆప్టిమైజేషన్ వయా డివైస్ ఇంజనీరింగ్"అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఈ డాక్టరేట్ ని ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణా అధికారి ఆచార్య కె.యస్.వి. కృష్ణారావు ప్రకటించారు. ముని మౌనిక రాసిన పరిశోధనా వ్యాసాలు స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ , గుర్తింపు పొందిన అమెరికన్ కెమికల్ సొసైటీ వంటి అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితం అయ్యాయి. ఈమె తన పరిశోధనలో పేటెంట్ అందుకున్నారు. ఈమె పరిశోధనలు ఎలక్ట్రికల్ వెహికల్స్, మోడరన్ ఎలక్ట్రానిక్ డివైసెస్ లలో ఉపయోగపడనున్నాయి. ఇదే విశ్వవిద్యాలయం లో తన ఎంఎస్సి ని చదివిన ముని మౌనిక మొదటి స్థానంలో నిలిచి డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ స్పైర్ ఫెలోషిప్ అర్హత సాధించి జేఆర్ఎఫ్, ఎస్ ఆర్ఎఫ అవార్డులను సొంతం చేసుకుంది. అలానే సింగిల్ గర్ల్ చైల్డ్ నేషనల్ స్కాలర్షిప్ ను అందుకున్నారు.లింగాల మండలం లో పట్నూతల మారుమూల గ్రామానికి చెందిన ముని మౌనిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివి డాక్టరేట్ అందుకోవడం పట్ల తల్లిదండ్రులు కుమారి,రామసుబ్బయ్య,గ్రామస్తులు అభినందనలు తెలిపారు.విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, ఫిజిక్స్ విభాగ ఆచార్యులు, స్కాలర్లు విద్యార్థులు ప్రశంసించారు.

# వీరబల్లికి ఎస్డీకేఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల మంజూరు

### • 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం

**వీరబల్లి మన జనప్రగతి జూన్ 09:-**గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి మండల కేంద్రంలో ఎస్డీకేఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను మంజూరు చేసినట్లు కళాశాల నిర్వాహకులు దుగ్గనపల్లి రవి శేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్య, వృత్తి నైపుణ్యాలు అందించేందుకు కళాశాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సులతో పాటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్టీ), మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ), ఎల్ఎండి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ప్రీ-స్కూల్ టీచర్ ట్రైనింగ్ వంటి ఉపాధి ఆధారిత కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ప్రాక్టికల్ శిక్షణ, కెరీర్ గైడెన్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని కళాశాల యాజమాన్యం వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కళాశాల మంజూరుకు సహకరించిన విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులకు వీఆర్‌డీఎస్ సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌కు పదేళ్లు

### - 29 మంది గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 09:-**పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు సమగ్ర ప్రసవ పూర్వ (అంటెనాటల్) పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవడంతో పాటు వారి సూచనలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.వైద్యాధికారి డాక్టర్ జి. మధుకుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన పీఎంఎస్ఎంఏ కార్యక్రమానికి పదేళ్లు పూర్తైన సందర్భంగా కేంద్రంలో 29 మంది గర్భిణీలకు రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు మరియు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అవసరమైన మందులను కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు.

# నాలుగు దశాబ్దాల స్నేహబంధానికి మరో ఆత్మీయ కలయిక

### • దిల్సుఖ్‌నగర్‌లో పూర్వ విద్యార్థుల ప్రత్యేక సమావేశం
### • సింగపూర్ ఉపాధ్యాయుడు గిరీష్ కుమార్‌కు ఘన సన్మానం



**హైదరాబాద్ (దిల్సుఖ్‌నగర్) మన జనప్రగతి జూన్ 09:**తెలంగాణ రాష్ట్రం వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 197880 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల స్నేహబంధం మరోసారి ఆత్మీయ వాతావరణంలో వెలుగుచూసింది. మంగళవారం హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దిల్సుఖ్‌నగర్‌లో ఆయన స్వగృహంలో ప్రత్యేక స్నేహితుల సమావేశం నిర్వహించారు.ఇటీవల వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం ఘన విజయాన్ని సాధించింది. అయితే వ్యక్తిగత కారణాల వల్ల ఆ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన కొందరు మిత్రులు మరోసారి కలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 46 సంవత్సరాల స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ 19 మంది మిత్రులు ఒకేచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఈ సందర్భంగా సింగపూర్‌లో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న బి. గిరీష్ కుమార్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సహపాఠుల నుంచి లభించిన ఈ గౌరవానికి గిరీష్ కుమార్ భావోద్వేగానికి లోనయ్యారు. పలువురు మిత్రులు తమ విద్యార్థి దశలోని అనుభవాలను, కళాశాల రోజులలోని మధురస్మృతులను పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.సమావేశంలో పాల్గొన్న వారు స్నేహబంధం కాలంతో సంబంధం లేకుండా మరింత బలపడుతుందని పేర్కొన్నారు. జీవితంలో వివిధ రంగాల్లో స్థిరపడ్డప్పటికీ తమ మధ్య ఉన్న అనుబంధం చెదరలేదని, ఇలాంటి సమావేశాలు పరస్పర ఆత్మీయతను మరింత పెంపొందిస్తాయని అన్నారు. భవిష్యత్తులో కూడా తరచూ కలుసుకోవాలని నిర్ణయించారు.అనంతరం అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు దిగుతూ ఈ అపురూపమైన కలయికను చిరస్మరణీయంగా మలిచారు.సమావేశంలో పాల్గొన్నవారు:హేమసుందర్ రెడ్డి, భీమ్ సుందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, బి. గిరీష్ కుమార్, నాగార్జున, అరుణ, రవి, రాములు, రత్నయ్య, వెంకట్ రెడ్డి, రంగస్వామి, భాస్కర్ గౌడ్, గోవర్ధన్, సర్వా రెడ్డి, మజీద్, ప్రకాష్, గోపాల్ రెడ్డి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాసనాలపై అవగాహన కార్యక్రమం



**గాలివీడు మన జనప్రగతి జూన్ 09:-** ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గాలివీడు మండలం నూలివీడు గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ పరిధిలో యోగాసనాలను, ధ్యానాన్ని ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, స్కూల్ కమిటీ చైర్మన్ వేల్పుల జనార్ధన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడైనటువంటి ఫయాజ్ ఉపాధ్యాయులు మనోహర్, ఆదినారాయణ, నాగరాజు తదితరులు పాల్గొని యోగాసనాలు చక్కగా నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన,యోగసనాలను కేటగిరిలవారీగా వివరించారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) గురించి శిక్షణ తరగతులు






**రామాపురం మన జనప్రగతి జూన్ 09:-**బుధవారం మండల కేంద్రమైన రామాపురం లోని టిడిపి కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ కార్యక్రమానికి రామాపురం మండల అధ్యక్షుడు గాలి వీటి. సురేంద్రారెడ్డి కస్టర్ ఇంచార్జ్ పప్పిరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మానా. చంద్రశేఖర్ మండలం టిడిపి నాయకులు హాజరై టీడీపీ నాయకులకు,కార్యకర్తలకు క్లస్టర్ మరియు యూనిట్ ఇన్చార్జిలకు,బూత్ కన్వీనర్లకు, బి ఎల్ ఏ లకు. శిక్షణ ఇవ్వడం జరిగింది ప్రభుత్వం నియమించిన బి ఎల్ వో లు చేస్తున్న ఓటర్ మ్యాపింగ్ ను ప్రతి ఒక్క ఓటరు మ్యాపింగ్ చేయించుకోవాలని చెప్పడం జరిగింది, ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ ఓటర్ మ్యాపింగ్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. అలా చేసుకోని పక్షంలో ఓటు తొలిగిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటర్ మ్యాపింగ్ చేయించుకోవాలని దిశా నిర్దేశం చేయడం జరిగిందిప్రభుత్వం నియమించిన బిఎల్ఓ లు ఈనెల 15 నుండి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.కాబట్టి ఈ డోర్ టు డోర్ కార్యక్రమంలో పార్టీ నియమించిన బిఎల్ఎలు తప్పనిసరిగా పాల్గొనాలని తెలియజేయడం జరిగిందిఅలాగే దొంగ ఓటర్లకు ఎటువంటి అవకాశం లేకుండా చూసుకోవాలని, కొత్త ఓటర్లను చేర్చాలన్న, దొంగ ఓటర్లను మరియు డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించాలన్న, బిఎల్ఓ లకు ఇన్ఫామ్ చేయాలని, బి ఎల్ ఏ లకు దిశా నిర్దేశం చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో,టిడిపి నాయకులు, కార్యకర్తలు,యూనిట్ మరియు బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా తీర్పు కోరుతూ ఈనెల 12న రాయచోటిలో శాంతియుత ర్యాలీ

### • వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



**అన్నమయ్య జిల్లా బ్యూరో జూన్ మన జనప్రగతి 09:-**రెండేళ్ల కూటమి పాలన అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ఈ నెల 12న ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా తీర్పును కోరుతూ రాయచోటిలో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.హామీలు గాలిలో.. ప్రజలు కష్టాలలో మంగళవారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు దిగజారడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలో నడుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో ఎక్కువ భాగం అమలుకు నోచుకోలేదని, దీంతో అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదన్నారు.ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే రూ.3.50 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని, అయితే సంక్షేమ పథకాల అమలులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని, మహిళలకు ఇచ్చిన ఆర్థిక హామీలు నెరవేర్చలేదని విమర్శించారు.**రైతు నుంచి యువత వరకు అందరికీ నిరాశే** రైతులకు గిట్టుబాటు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీలు అందడం లేదని, ఎరువుల కొరత సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆరోగ్యశ్రీ బకాయిల కారణంగా పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, గృహ నిర్మాణ పథకాలను ప్రస్తావించిన శ్రీకాంత్ రెడ్డి, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క కొత్త పక్కా గృహాన్ని కూడా మంజూరు చేయలేదన్నారు.**అన్ని రంగాల్లో వైఫల్యం..ప్రజల్లో అసంతృప్తి** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని, పలు ఘటనల్లో బాధితులకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు, ప్రజా మద్దతుతో ఈ నెల 12న రాయచోటిలో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు.

# చిట్లూరు హరిజనవాడ దాహార్తిని తీర్చిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

### • బోరు ద్వారా పుష్కలంగా నీరు..ఆనందంలో గ్రామస్తులు,మంత్రికి కృతజ్ఞతలు



**రామాపురం మన జనప్రగతి జూన్ 09:-**రామాపురం మండలంలోని చిట్లూరు గ్రామ హరిజనవాడలో నెలకొన్న త్రాగునీటి సమస్యకు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తక్షణమే స్పందించి పరిష్కారం చూపించారు. గ్రామంలో తీవ్రమైన నీటి కొరత ఉండటంతో రామాపురం మండల టీడీపీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరమణతో పాటు స్థానిక నాయకులు, గ్రామస్తులు మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే స్పందించి మంగళవారం బోరు యంత్రాన్ని గ్రామానికి పంపించారు. బోరు తవ్వకాల్లో సుమారు మూడు అంగుళాల మేర నీరు లభించడంతో గ్రామస్తుల్లో ఆనందం వెల్లివిరిసింది.ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే గుర్తించి స్పందించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు నిర్వహించారు. మంత్రి చొరవ వల్ల హరిజనవాడ ప్రజల దాహార్తి తీరిందని వారు పేర్కొన్నారు

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
10 - 06 - 2026

# రొయ్యల రైతుల సంక్షేమం

### ఆక్వాకల్చర్ రంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఫీడ్ ధరల అంశంపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి

### అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 రాయితీ

### ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి మన జనప్రగతి జూన్ 09:-** రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాల ధరలు, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ)తో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్-ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.రైతు ప్రతినిధులు తాత్కాలికంగా కిలోకు రూ.6 మేర మాత్రమే ధర పెంపును ఒక నెలపాటు పరిమితం చేయాలని సూచించినట్లు తెలిపారు. అలాగే మత్స్యశాఖ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్ (సీబా), రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారుల ప్రతినిధులతో కూడిన శాస్త్రీయ ధరల కమిటీ ఏర్పాటు ప్రతిపాదన కూడా వచ్చినట్లు చెప్పారు. ఈ కమిటీ ముడి పదార్థాల ధరలు, డబ్ల్యూపీఐ తదితర ప్రమాణాలను పరిశీలించి సిఫార్సులు చేయనుందని వివరించారు. ఇదే సమయంలో, కొత్త ధరల విధానం అమల్లోకి వచ్చే వరకు కిలోకు రూ.12 మేర తాత్కాలిక పెంపును పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తయారీదారులు తెలిపారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై తుది ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పరస్పర సంప్రదింపుల ద్వారా త్వరితగతిన పరిష్కారం కనుగొనాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఈ సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాస్, ఏపీఎస్ఏడీఏ కో-వైస్ ఛైర్మన్ ఆనమ్ వెంకట రమణారెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కేంద్ర మత్స్యరంగ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ సంఘాల నాయకులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీదారులు, సముద్ర ఆహార ఎగుమతిదారులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్ల భాగస్వామ్యం కీలకం: కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 09:-** జిల్లా ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (ఔజజ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (ఔా=జ) బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.18,013 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను ఆమోదించినట్లు తెలిపారు. ఇందులో ప్రాధాన్యత రంగానికి రూ.14,503 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.12,654 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16,619 కోట్ల లక్ష్యానికి గాను రూ.19,962 కోట్ల రుణాలు మంజూరు చేసి 120.11 శాతం ప్రగతి సాధించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో రూ.12,272 కోట్ల లక్ష్యానికి రూ.13,480 కోట్లు, ప్రాధాన్యత రంగంలో రూ.14,193 కోట్ల లక్ష్యానికి రూ.14,961 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ, విద్యా, గృహ రుణాల మంజూరును మరింత పెంచాలని బ్యాంకర్లకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించడంతో పాటు మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలు, చేనేతలు, మత్స్యకారులకు రుణాలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం జి. ఆంజనేయులు, నాబార్డ్ డీడీఎం పృద్వి, ఆర్బీఐ అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదం ప్రభుత్వ వైఫల్యం: రాచమల్లు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూన్ 09:-** వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం అనుకోకుండా జరిగినది కాదని, యాజమాన్యం నిర్లక్ష్యం, కాలం చెల్లిన యంత్రాల వినియోగం, భద్రతా ప్రమాణాల అమలులో లోపాల కారణంగానే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం స్థానిక దొరసానిపల్లెలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు తగిన ఆర్థిక సహాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడం విచారకరమని రాచమల్లు విమర్శించారు. గతంలో ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన మంత్రి నారా లోకేష్ కార్మిక సంఘాల ప్రతినిధులతో వ్యవహరించిన తీరు కూడా బాధాకరంగా ఉందన్నారు. కార్మిక సంఘాలు రాజకీయాలు చేస్తున్నాయంటూ వ్యాఖ్యానించడం రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని విమర్శించారు. కార్మికుల ప్రాణాలకు సంబంధించిన అంశాలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున, గాయపడిన వారికి రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్న కార్మిక సంఘాల డిమాండ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని రాచమల్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ డిమాండ్లను అమలు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని, యంత్రాల నిర్వహణ, మరమ్మత్తుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల ప్రాణ భద్రతే ప్రభుత్వానికి, యాజమాన్యానికి మొదటి ప్రాధాన్యత కావాలని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో ప్రజలు కూటమి ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వామ పక్షాల ఆందోళన



**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 09:-** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ ప్రజలపై అదనపు భారాలు మోపుతోందని ఆరోపిస్తూ సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండ పట్టణంలోని కవిత హోటల్ సర్కిల్ వద్ద భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనలో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేశవరెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ సామాన్య ప్రజల జీవన వ్యయాన్ని మరింత భారంగా మారుస్తోందని విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాలు తదితర కారణాలను సాకుగా చూపుతూ ధరల పెంపును సమర్థించడం సరికాదన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం విరమించుకోకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకో కారణంగా కొంతసేపు ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి చెన్నారాయుడు, సహాయ కార్యదర్శి నాగేంద్ర, నాయకులు మల్లేష్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు మధుసూదన్ నాయుడు, రంగారెడ్డితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

## ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపడుతున్నాం

### - కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి జూన్ 09:-** ప్రతి ఇంటి ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చక్కగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. నగరంలో చెత్త సేకరణ కొరకు నూతనంగా కొనుగోలు చేసిన రెండు ఆటోలను కమిషనర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ జరుతున్న సమయంలో వాహనాలు బ్రేక్ డౌన్ అయిన సమస్యంలో ఇబ్బందులు రాకుండా అన్ని వీధుల్లోకి వెళ్లేలా చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సమగ్రంగా చెత్త సేకరణ చేసేందుకు వీలుగా కొత్త వాహనాలు కొనుగోలు చేశామని తెలిపారు. కాలువల్లో, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి, వాహనాలకు చెత్త నగర పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి.ఈ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

# పాల్తూరులో ఘనంగా అంగన్‌వాడి పిలుస్తోంది

- కిశోరి వికాసం కార్యక్రమం
- చిన్నారులందరినీ అంగన్‌వాడీల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచన




**విడపనకల్లు మన జనప్రగతి జూన్ 09:-** పాల్తూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో "అంగన్‌వాడి పిలుస్తోంది - కిశోరి వికాసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, అంగన్‌వాడి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గృహ సందర్శనలు చేపట్టారు. అంగన్‌వాడీ సేవల ప్రాముఖ్యత, చిన్నారుల విద్యాభివృద్ధిలో వాటి పాత్రపై తల్లిదండ్రులకు వివరించారు. 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్యతో పాటు పిల్లల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకత, క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికల ఆరోగ్యం, విద్య, హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టాలని, రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి ఉపాధ్యాయులు దుర్గ, లక్ష్మి, మహేశ్వరి, రాధ, నాగశేషి, ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.


## ఉద్దేహాల్‌లో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీలో మలేరియా సబ్ యూనిట్ అధికారి,నాగేంద్ర ప్రసాద్




**బొమ్మనహల్ మన జనప్రగతి జూన్ 09:-** మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా బొమ్మనహల్ మండలంలో ఉద్దేహాల్ గ్రామ ఎస్టీ కాలనీ ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై,రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి,నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు, మరి ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని పాత టైర్లు,కొబ్బరి చిప్పలు,ప్లాస్టిక్ పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు,రాత్రి సమయంలో దోమతెరలు ఉపయోగించడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు, అనంతరం దోమతెరలు వాడండి, దోమకాటు నుంచి రక్షణ పొందండి చిన్నదోమ,పెద్దప్రమాదం,మురికినీటి కుంటలు,దోమలకు ఆవాస కేంద్రాలు,వేపాకు పొగ,దోమలకు సెగ,అనే నినాదాలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివన్న,ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి,ఆరోగ్య కార్యకర్తలు జానకి,గోవర్ధన్,ఆశా కార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి,హరిత లక్ష్మి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాడి రైతులు పశువులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

### - అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ సూచన



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 09:-** పాడి రైతులు తమ వద్ద ఉన్న పశువులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ సూచించారు. మంగళవారం వీరబల్లి మండలంలోని తాటికుంటపల్లె ఆర్‌ఎస్‌కే కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌కే కేంద్రంలో అమలవుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం, పశువుల ఆధార్ నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పశువుకు ఆధార్ నమోదు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా అందుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో ఏహెచ్ ఆంజనేయులు, ఏవీహెచ్ సుండుపల్లెతో పాటు పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
10 - 06 - 2026

# స్మార్ట్ కిచెన్‌లతో విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా

**స్మార్ట్ కిచెన్స్ వర్క్ షాపులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**మండల సమాఖ్య సభ్యులే 'సూపర్ మేనేజర్లు**

**నాణ్యమైన పౌష్టికాహారంలో రాజీ లేదు**




**కడప మన జనప్రగతి,జూన్ 09:-** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి శుభ్రమైన,సురక్షితమైన, పోషక విలువలు కలిగిన వేడివేడి భోజనం అందించడమే స్మార్ట్ కిచెన్ ల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో.. స్మార్ట్ కిచెన్ల నిర్వహణపై సంబంధిత స్టేక్ హోల్డర్స్ కు అవగాహన పెంచే ఒక్కరోజు వర్క్ షాపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధీ మీనా హాజరై పలు కీలక మార్గదర్శకాలను వెల్లడించారు. **ప్రభుత్వం ఖరారు చేసిన మెనూనే అమలు**విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో సమతుల్య పోషకాలు ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. గుడ్లు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు,కూరగాయలు, పండ్లు వంటి పోషకాహార పదార్థాలు తప్పనిసరిగా ఉండేలా వారాంత మెనూ సిద్ధం చేసినట్లు చెప్పారు.ప్రతి స్మార్ట్ కిచెన్‌లో మెనూ బోర్డును ప్రదర్శించి, అందులో ఎలాంటి మార్పులు చేయకుండా కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. **పరిశుభ్రతే విజయానికి మూలం.**పిల్లల ఆరోగ్యం,ఎదుగుదల, విద్యా ప్రగతికి పౌష్టికాహారం అత్యంత అవసరమని పేర్కొంటూ,స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో నాణ్యత, పరిశుభ్రత,సమయపాలన విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.స్మార్ట్ కిచెన్లలో పనిచేసే వంట సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. వంట సమయంలో టోపీ, గ్లౌజులు, ఆప్రాన్ ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, గోళ్లు కత్తిరించుకోవడం వంటి నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు లేదా ఇతర అంటువ్యాధులతో బాధపడుతున్న వారు వంటశాలలోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు.వంటశాలలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, నేలను తరచుగా శుభ్రపరచాలని,పాత్రలను వేడినీటితో కడగాలని ఆదేశించారు.పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమం కావడంతో పరిశుభ్రత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. **పోషక విలువలు తగ్గకుండా ఆధునిక వంట విధానాలు** కూరగాయలను శుభ్రపరిచిన తర్వాత మాత్రమే వంటకు ఉపయోగించాలని,స్టీమ్ కుకింగ్ విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఎక్కువసేపు ఉడికించడం వల్ల పోషక విలువలు తగ్గిపోతాయని, అందువల్ల శాస్త్రీయ పద్ధతుల్లో వంట ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు.వండిన ఆహారాన్ని నిర్ణీత సమయానికే విద్యార్థులకు అందించాలని, నిల్వ ఉంచిన లేదా మళ్లీ వేడి చేసిన ఆహారాన్ని వడ్డించరాదని స్పష్టం చేశారు. **మండల సమాఖ్య సభ్యులదే పూర్తి బాధ్యత.**ప్రతి మండలంలోని స్మార్ట్ కిచెన్ నిర్వహణ బాధ్యతలను మహిళా మండల సమాఖ్య సభ్యులు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.వారే 'సూపర్ మేనేజర్లు'గా వ్యవహరిస్తూ సరుకుల కొనుగోలు,నాణ్యత పరిశీలన, నిల్వ, వంట, పంపిణీ, పరిశుభ్రత, ఫీడ్‌బ్యాక్ సేకరణ,రికార్డుల నిర్వహణ వంటి అన్ని అంశాలను పర్యవేక్షించనున్నారని చెప్పారు.రోజువారీ స్టాక్ రిజిస్టర్, వంట రిజిస్టర్,హాజరు రిజిస్టర్, ఫిర్యాదుల రిజిస్టర్ నిర్వహణ లో నిర్లక్ష్యం ఉండరాదని, ఏ చిన్న లోపం జరిగినా బాధ్యత సంబంధిత సమాఖ్య సభ్యులదేనని స్పష్టం చేశారు.స్మార్ట్ కిచెన్ అనేది కేవలం వంటశాల కాదని,అది విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రగతి, భవిష్యత్తుకు బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పాఠశాల హాజరు, అభ్యాస సామర్థ్యం కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. **కిచెన్ మేనేజర్లు, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లకు ప్రత్యేక బాధ్యతలు** ప్రతి స్మార్ట్ కిచెన్ లో ఒక కిచెన్ మేనేజర్‌తో పాటు ఒకటి లేదా రెండు స్మార్ట్ డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు పనిచేస్తారని కలెక్టర్ వివరించారు. కిచెన్ మేనేజర్ వంట,నాణ్యత, పరిశుభ్రత అంశాలను పర్యవేక్షిస్తే, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు హాట్ బాక్సుల ద్వారా పాఠశాలలకు వేడివేడి భోజనం సమయానికి చేరేలా చూస్తారని తెలిపారు.ఈ బాధ్యతలను సమర్థవంతం గా నిర్వహించేందుకు హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణులు, పోషకాహార నిపుణులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. **ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ**స్మార్ట్ కిచెన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు బలమైన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఎంఈఓలతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు కిచెన్లను తరచూ తనిఖీ చేస్తూ నాణ్యత ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో పరిశీలించనున్నారని చెప్పారు.ఆహార నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు, సరుకుల నిల్వ, వంట విధానాలు, పాఠశాలలకు భోజన పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేక నివేదికలు సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి అందజేయనున్నట్లు తెలిపారు. **జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్**స్మార్ట్ కిచెన్ల నిర్వహణను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కిచెన్ల నుంచి వచ్చే సమాచారం, ఫిర్యాదులు, సూచనలను వెంటనే స్వీకరించి స్పందించే విధంగా వ్యవస్థ రూపొందిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి కిచెన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా వంట ప్రక్రియ, పరిశుభ్రత,ఆహార పంపిణీ తదితర అంశాలను జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.తల్లిదండ్రులకు ప్రత్యేక యాప్ ద్వారా ప్రతిరోజూ మెనూ, ఫొటోలు, వీడియోలు పంపించి పూర్తి పారదర్శకతను తీసుకురానున్నట్లు చెప్పారు.**స్మార్ట్ కిచెన్లను దేశానికే ఆదర్శంగా నిర్వహించాలి** స్మార్ట్ కిచెన్ వ్యవస్థను రాష్ట్రానికే కాకుండా దేశానికీ ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు.అధికారులు,మండల సమాఖ్య సభ్యులు,కిచెన్ సిబ్బంది అందరూ నిబద్ధతతో పనిచేసి కడప జిల్లాను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రతిష్ఠాత్మక ప్రధానమంత్రి అవార్డు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంచే విధంగా ఈ కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా అమలు చేయాలని అన్ని శాఖల అధికారులు, మండల సమాఖ్య సభ్యులకు కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా,స్టెప్ సీఈవో, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డీఈవో శంశుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మీ, ఆర్ డబ్ల్యూఎస్, పీఆర్ ఎస్ఈ లు ఏడుకొండలు, మద్దయ్య, ఐసీడీఎస్ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, అన్ని మండలాల ఎంఈఓలు, మండల సమాఖ్య అధ్యక్షులు,కిచెన్ మేనేజర్లు, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు పాల్గొన్నారు.

# హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు ఆస్కారమివ్వొద్దు: మంత్రి సవిత

**● విద్యార్థులు వచ్చేనాటికి హాస్టళను, గురుకులాలను శుభ్రం చేయండి ● బీసీ బిడ్డల ఉన్నత విద్యే కూటమి లక్ష్యం ● రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాల ఏర్పాటు ● ఆప్కో, లేపాక్షి షోరూమ్‌ల్లో అమ్మకాలు పెంచండి ● బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షలో మంత్రి సవిత**





**తిరుపతి మన జనప్రగతి జూన్ 09:-** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వకుండా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచాలని, చేనేతలకు, హస్త కళాకారులకు రోజూ ఉపాధి కల్పించాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్ లో బీసీ సంక్షేమ, ఆప్కో, లేపాక్షి అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా చేపడుతున్నఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మాట్లాడుతూ, కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో చేరేలోగా, తరగతి గదులను, విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్లు, గురుకుల్లాల్లో చేరే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో అత్యధిక మంది విద్యార్థులను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంలో భాగంగా ఐఐటీ, నీట్ కు ఉచిత శిక్షణ అందజేయనున్నామన్నారు. విశాఖ, టేకులోడు ఎంజేపీ స్కూళ్లలో రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణా తరగతులు ప్రారంభించనున్నామని మంత్రి సవిత వెల్లడించారు. **ఆరోపణలకు ఆస్కారమివ్వొద్దు** గతేడాది బీసీ హాస్టళ్ల వార్డెన్లపై విపరీతమైన ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. ఇది క్షమించరాని నేరమన్నారు. భవిష్యత్తులో బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై ఎటువంటి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపాళ్ల చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. హాస్టళ్లు, గురుకులాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల సంస్థల నేపథ్యంలో వార్డెన్లు, ఎంజేపీ గురుకులాల ప్రిన్సిపాల్లు అమరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. **అమ్మకాలు పెంచండి..** అనంతరం చేనేత, హస్త కళల అధికారులతో మంత్రి సవిత కీలక భేటీ నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఎన్ని ఆప్కో, లేపాక్షి షో రూమ్ లున్నాయన్నారు. ఆయా షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచేలా చర్యలు తీసువాలని ఆదేశించారు. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణకు తరంగా అనే యాప్ అనే ఆధారాత వ్యవస్థను సిద్ధం చేశామ్నారు. ఏనాటి అమ్మకాలను ఆనాడే ఈనాటి నుంచే చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. **మంత్రి సవితతో బీసీ సంఘ నేతల భేటీ** తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి సవితను పలువురు బీసీ సంఘ ప్రతినిధులు కలిశారు. బీసీల సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేసి, సత్కరించారు. మరికొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. అందుకు మంత్రి సవిత సుముఖత వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూవో భరత్ రెడ్డి సహా చేనేత, జౌళి శాఖ, లేపాక్షి అధికారులు పాల్గొన్నారు. మంత్రి సవితను కలిసిన వారిలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు ఆర్.సదాశివ, ఎస్.త్యాగరాజన్, వి.చంద్రశేఖర్ సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకోవాలి



**తిరుపతి, మన జనప్రగతి జూన్ 09:-** చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 2026 ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లు 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకోవాలని తిరుపతి ఆర్డీవో, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రామ్మోహన్ సూచించారు.మంగళవారం తిరుపతి రూరల్ మండలం దామినేడు గ్రామంలో ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూన్ 14లోపు సంబంధిత బూత్ లెవెల్ అధికారుల వద్ద వివరాలు సమర్పించి మ్యాపింగ్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్ఓలకు సూచించారు.

# రైతు,మహిళా,ప్రజా సంక్షేమల అమలులో అధికారులు మరింత చొరవ చూపాలి

**● జెడ్.పి.టి.సి కోకటం వెంకట బైపిరెడ్డి,ఎంపీపీ చల్ల గంగాదేవి.**

**● మండలంలో నీటి సమస్యలు లేకుండా చర్యలు ● గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు ● అరటి, ఉల్లి రైతులకు పరిహారం డిమాండ్**






**వేముల మన జనప్రగతి జూన్ 09:-** మండలంలో రైతు, మహిళా, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అధికారులు మరింత చొరవ చూపి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జడ్పీటీసీ కోకటం వెంకట బైపిరెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణ సూచించారు. మంగళవారం వేముల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన, ఇంచార్జి ఎంపీడీఓ కుమార రంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో వారు వారు మాట్లాడుతూ...మండలంలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేముల ఐటీ, జూనియర్ కళాశాలల వద్ద నెలకొన్న త్రాగునీటి సమస్యను జడ్పీటీసీ నిధులతో పరిష్కరిస్తామని, పెద్ద జూటూరు సచివాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే డ్రైనేజీ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో వైద్యాధికారి శరణ్య రెడ్డి మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థినులకు క్యాన్సర్ నివారణ కోసం ముందస్తు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డి పామ్ ఆయిల్ సాగుకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించగా, పశు వైద్యాధికారి మురళీకృష్ణ పశువులకు నట్టల నివారణ చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా 125 రోజుల ఉపాధి కల్పిస్తున్నట్లు ఈసీ మధు, డ్వాక్రా మహిళలకు రూ.20 లక్షల వరకు హామీ లేకుండా రుణాలు అందిస్తున్నట్లు సీసీ జ్యోతి వెల్లడించారు.ఆర్డబ్ల్యూఎస్ డీఈ సాలన్న మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఎంపీపీ, జడ్పీటీసీ నిధులతో పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు.అకాల వర్షాలతో నష్టపోయిన అరటి రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని, గత ఏడాది నష్టపోయిన ఉల్లి రైతులకు పెండింగ్ పరిహారం చెల్లించాలని ఎంపీపీ, జడ్పీటీసీ అధికారులు డిమాండ్ చేశారు. పాడా పథకం కింద వాటర్ క్యారీయింగ్ పైపుల కోసం డీడీలు చెల్లించిన రైతులకు ఇప్పటికీ పైపులు అందకపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.సమావేశానికి హాజరుకాని విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నోటీసులు జారీ చేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సమావేశంలో డీఈ సాలన్న, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అంశాలపై రాష్ట్ర స్థాయి సమీక్ష

**జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి దిశానిర్దేశం**

**తిరుపతి, మన జనప్రగతి, జూన్ 09 :-** భూపరిపాలన, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) మరియు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి అధ్యక్షత వహించి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా 22-ఏ భూములు, వెబ్‌ల్యాండ్ నిర్వహణ, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, రీ-సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, అటవీ భూములు, గృహ వసతి, ఐవీఆర్ఎస్ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సంబంధిత కార్యక్రమాల అమలులో పురోగతిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో చేపడుతున్న రెవెన్యూ సంస్కరణలు, భూ పరిపాలన కార్యక్రమాల పురోగతిని రాష్ట్ర అధికారులకు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, సూళ్లూరుపేట ఆర్డీవో దేవేంద్రరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, ల్యాండ్ అండ్ సర్వే అధికారి రాంప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174